AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

22-10-2026 (Thursday) MAIN EDITION

కడప జిల్లా బద్వేల్‌లో ఉద్రిక్తత



అక్షరటుడే, ఏపీ: కడప జిల్లా బద్వేల్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎమ్మెల్యే డాక్టర్ సుధాను పోలీసులు అరెస్ట్ చేసి, అట్లూరు పీఎస్‌కు తరలించారు. దీంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. నాలుగు రోడ్ల కూడలికి వైసీపీ కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. అక్కడ టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

ఐపీవోకు పాలిమర్ కంపెనీ


అక్షరటుడే, బిజినెస్ డెస్క్: బీఎల్ఎస్ పాలిమర్స్ కంపెనీ ఐపీవోకు వచ్చింది. ఈ కంపెనీ వైర్లు, కేబుళ్లు, భూగర్భ పైప్‌లైన్‌లలో ఉపయోగించే ప్రత్యేక పాలిమర్ సమ్మేళనాలను తయారుచేస్తుంది. ఐపీవో సబ్ స్క్రిప్షన్ అక్టోబర్ 27న ప్రారంభమై 29న ముగియనుంది. షేర్ల అలాట్‌మెంట్ స్టేటస్ అక్టోబర్ 30న వెల్లడి కానుంది.

Mainboard

BLS POLYMERS LTD. Excellence in Compounding

BLS Polymers

ప్రియుడి కోసం భర్తను హతమార్చిన భార్య



అక్షరటుడే, యూపీ : ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిందో మహిళ. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లో చోటు చేసుకుంది. బాగ్‌పత్ ప్రాంతానికి చెందిన ప్రమోద్, ఊర్మిళ దంపతులు. ఆమెకు సికిందర్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. తమ బంధానికి అడ్డుగా ఉన్న భర్తను ఊర్మిళ, సికిందర్ కలిసి హత్య చేశారు.

సీజేపీ నేతలకు ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ షాక్!



అక్షరటుడే, ఢిల్లీ : జంతర్ మంతర్ వద్ద అనుమతి లేకుండా నిరసన తెలిపిన 'కాక్రోచ్ జనతా పార్టీ' నేతలకు ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు వారికి షాకిచ్చారు. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు జారీ చేశారు. సౌరవ్ దాస్, అశుతోశ్ రంకాతో పాటు అజింక్య షిండేకు సమన్లు జారీ చేశారు.

కాల్పులు జరిపిన టీడీపీ నేత




అక్షరటుడే, ఏపీ : కడప జిల్లా నందలూరులో కాల్పుల కలకలం రేగింది. టీడీపీ తరపున నామినేషన్ వేయడానికి విజయ శేఖర్‌రెడ్డి రావడంతో మరో వర్గం వారు వ్యతిరేకించారు. ఆయనపై దాడి చేసి, కారును తగులబెట్టారు. ఈక్రమంలో టీడీపీ నేత సుబ్రహ్మణ్యం గాల్లోకి కాల్పులు జరిపారు. ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.

రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు



అక్షరటుడే, హైదరాబాద్ : దసరా పండుగ వేళ మద్యం అమ్మకాలు భారీ స్థాయిలో నమోదయ్యాయి. పండుగకు ముందు వచ్చిన కేవలం నాలుగు రోజుల పనిదినాల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా రూ.755 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. గతేడాది దసరా సమయంలో నాలుగు రోజుల్లో రూ.698 కోట్ల అమ్మకాలు జరగగా, ఈసారి ఆ రికార్డు బద్దలైంది. అక్టోబర్ 19న ఒక్క రోజే ఏకంగా రూ.303 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయింది.


యూపీలో దారుణం.. కారుతో ఢీకొట్టి హత్య



అక్షరటుడే, యూపీ : ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. ఓ వ్యక్తిని పాతకక్షల నేపథ్యంలో కొంతమంది హత్య చేశారు. కాన్పూర్‌లోని అర్రా ప్రాంతానికి చెందిన బీరు సింగ్‌ను ఇంటికి వెళ్తుండగా.. కొందరు అడ్డగించారు. అతడిపై దాడి చేశారు. అతడి చేతులను కారు డోర్లకు కట్టి, అతడిని వేలాడతీశారు. 1.5 కిలోమీటర్ల దూరం వరకు కారును అలాగే తీసుకెళ్లారు. అనంతరం అనంతరం అతడిని రోడ్డుపై పడేసి, కారుతో తొక్కించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముదిరాజ్‌లకు సామాజిక న్యాయం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ–ఏలోకి మారుస్తామన్నారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా ఈ ప్రక్రియ సాగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పండుగ సాయన్న జయంతి వేడుకలను హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అధికారికంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



‘బీసీ–ఏ’లోకి మారుస్తాం

- సీఎం రేవంత్‌రెడ్డి
- కుల గణనపై కీలక వ్యాఖ్యలు
- ఘనంగా పండుగ సాయన్న జయంతి

బీసీ వర్గాలకు సామాజిక న్యాయం అందించడమే తమ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వందేళ్ల చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని సాహసాన్ని తమ ప్రభుత్వం చేసి చూపించిందని, ఏడాది వ్యవధిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను వెలికితీశామని తెలిపారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చే ప్రక్రియను హడావుడిగా చేస్తే కోర్టులు కొట్టేసే అవకాశం ఉందన్నారు. న్యాయ నిపుణులు సంప్రదించి.. దీనిని ముందుకు తీసుకు వెళ్తామన్నారు. ముదిరాజ్‌ల సమస్యలపై తనకు సంపూర్ణ అవగాహన ఉందన్నారు. ప్రభుత్వంలో వారిని భాగస్వామ్యం చేస్తామని హామీ ఇచ్చారు.

పేదలకు పంచారు

మహబూబ్‌నగర్ జిల్లాలో పండుగ సాయన్న పేదలకు అండగా నిలిచారని సీఎం అన్నారు. దొరల గడీలలో పంటలను కొల్లగొట్టి పేదలకు పంచారన్నారు. బంగారం, నిధులను పేదల పెళ్లిళ్లకు ఇచ్చారని కొనియాడారు. ఆయనను అరెస్ట్ చేస్తే ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం చేశారన్నారు. అయితే పండుగ సాయన్నకు 40 ఏళ్లు నిండక ముందే ఉరి తీశారన్నారు. పండుగ సాయన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ముదిరాజ్ సోదరులు నమ్మకమైన, పౌరుషం ఉన్న వాళ్లన్నారు.

కేసీఆర్‌పై పరోక్ష వ్యాఖ్యలు..

తన పనితీరుపై మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. తనకు ఇంకా వయస్సు, తగినంత ఓపిక ఉన్నాయని, తానేమీ ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు. ప్రజా సేవే లక్ష్యంగా తాము నిరంతరం శ్రమిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన మంచి సంక్షేమ పథకాలను నిలిపివేయకుండా కొనసాగిస్తూనే, తమ ప్రభుత్వం కొత్తగా మరిన్ని ప్రజానుకూల పథకాలను తెచ్చిందని వివరించారు.

గడ్డం పెంచితే సీఎం అవుతారా : ధర్మపురి అర్వింద్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : తెలంగాణలో బీజేపీ పార్టీ సైలెంట్ అయిపోయిందన్న ప్రచారంపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర స్థాయిలో స్పందించారు. రాష్ట్రంలో పార్టీ సైలెంట్ కాలేదని, 2028 ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ సునామీ సృష్టించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ గడ్డం పెంచడంపై అర్వింద్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతావని ఎవరో చెబితేనే కేటీఆర్ అలా చేస్తున్నారని ఎగతాళి చేశారు. గతంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా సీఎం కావాలని గడ్డం పెంచుకున్నారని, కానీ ఆయన గడ్డం పెరిగింది తప్ప పార్టీ పుంజుకోలేదని గుర్తుచేశారు.

ఆర్చరీలో భారత్‌కు గోల్డ్ మెడల్



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : జపాన్‌లో జరుగుతున్న ఆసియా పారా గేమ్స్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. గురువారం శీతల్ దేవి, తోమన్ కుమార్ జోడీ ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఇండోనేషియాపై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. మహిళల డిస్కస్ త్రోలో సువర్ణ రాజ్ స్వర్ణం సాధించింది. ఆర్చరీ మహిళల విభాగంలో హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో చైనాకు చెందిన సెన్ మెంగ్కాన్ చేతిలో 46 తేడాతో ఓడిపోయిన స్వాతి చౌదరి రజత పతకాన్ని సాధించింది.

గుజరాత్‌లో భారీగా డ్రగ్స్ స్వాధీనం



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో అధికారులు భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. రూ. 25.5 కోట్ల విలువైన హెరాయిన్, మెఫెడ్రోన్ పట్టుకున్నారు. అహ్మదాబాద్, సూరత్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి భారీ ఆపరేషన్ చేపట్టారు. అహ్మదాబాద్‌వడోదర ఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న సీటీఎం టోల్ ప్లాజా సమీపంలో ఒక అంతర్రాష్ట్ర డ్రగ్ సిండికేట్‌ను పట్టుకున్నారు. వారి నుంచి రూ 25.65 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ, మీరట్‌కు చెందిన ముగ్గురు పెడ్లర్లను అరెస్టు చేశారు.

శుద్ధి చేసిన నీటి వినియోగానికి ప్రాధాన్యం

అక్షరటుడే, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని కోకాపేట గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గించేందుకు శుద్ధి చేసిన నీటి వినియోగానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ నీటిని నిర్మాణ రంగం, రోడ్ల శుభ్రత, దుమ్ము నియంత్రణ, ఉద్యానవనాలకు వినియోగించాలని సూచించారు. ఫిల్లింగ్ స్టేషన్‌లో శుద్ధి చేసిన నీటి నాణ్యత ప్రమాణాలు, పరీక్షల ఫలితాలను ఎండీ పరిశీలించారు.

డీసీఎంను ఢీకొన్న బైక్..



అక్షరటుడే, రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దేవి అనే యువతి దసరా సెలవుల సందర్భంగా హైదరాబాద్ నగరంలోని నారాయణగూడలో బంధువుల ఇంటికి వెళ్లింది. సెలవులు ముగియడంతో ఆమెను తండ్రి ఇంటికి తీసుకు వెళ్లడానికి వచ్చాడు. ఇద్దరు కలిసి బైక్‌పై వెళ్తుండా.. శంషాబాద్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వీరి బైక్ ఎదురుగా వస్తున్న డీసీఎంను ఢీకొంది. ఈ ఘటనలో తండ్రి మృతి చెందగా.. దేవికి తీవ్ర గాయాలు అయ్యాయి.

నేను ట్రావెల్ ఏజెంట్‌ను కాదు : శశిథరూర్



అక్షరటుడే, ఢిల్లీ : కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటన గురించి అడగ్గా.. తాను ఆయన ట్రావెల్ ఏజెంట్‌ను కాదన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన వేళ.. రాహుల్ గాంధీ వియత్నాం పర్యటనకు వెళ్లారు. దీనిపై విలేకర్లు ఎంపీ శశిథరూర్‌ను ప్రశ్నించగా.. ఘాటుగా స్పందించారు. తాను ట్రావెల్ ఏజెంట్‌ను కాదని పేర్కొన్నారు. తనను ఈ ప్రశ్న అడగడంలో అర్థం లేదన్నారు. ప్రతి వ్యక్తికి కొన్ని బాధ్యతలు ఉంటాయని, దీనిపై తాను ఎలాంటి వ్యాఖ్య చేయలేనని చెప్పారు.